క్లుప్తంగా

'శెట్టిబలిజ' క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సూర్యనారాయణరావు తదితరులు

అమలాపురం టౌన్: పశ్చిమ గోదావరి ఉమ్మడి జిల్లా శెట్టిబలిజ సంఘం ముద్రించిన 2023 క్యాలెండర్‌ను స్థానిక హైస్కూలు సెంటరులోని శెట్టిబలిజ సంఘం భవనంలో ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు కన్వీనర్ కుడుపూడి సూర్యనారాయణరావు, ఆ జిల్లా సంఘాల నేతలతో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పశ్చిమ గోదావరి ఉమ్మడి జిల్లా శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు కోడి దుర్గారావు, రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షుడు సానబోయిన రామారావు, యువత రాష్ట్ర అధ్యక్షుడు గుత్తుల శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

'బుద్దిస్ట్' క్యాలెండర్..



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

అమలాపురం టౌన్: బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా (బీఎస్ఐ) జిల్లా శాఖ 2023 సంవత్సరానికి ముద్రించిన క్యాలెండర్‌ను ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు వై.హరిబాబు, కార్యదర్శి మత్రి బాబ్జి స్థానిక గడియారం స్తంభం సెంటరులో ఆదివారం ఆవిష్కరించారు. బీఎస్ఐ నాయకుడు మట్టా సిద్ధార్థ గౌతమ్ అధ్యక్షతన జరిగిన సభలో బీఎస్ఐ జాతీయ కార్యదర్శి బౌద్ధ పరిశోధకులు పిల్లి రాంబాబు, మట్టా వెంకటరావు తదితరులు బుద్దిస్ట్ సొసైటీ లక్ష్యాలను వివరించారు. బీఎస్ఐ నాయకులు పెనుమాల చిట్టిబాబు, ఐఎస్ మల్లేశ్వరరావు, పచ్చిమాల బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతల ఉత్సవాలు ప్రారంభం



చల్లపల్లిలో అమ్మవార్ల ఘటాలను ఊరేగిస్తున్న గ్రామస్తులు

ఉప్పలగుప్తం: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండల పరిధి చల్లపల్లిలో ఏటా గ్రామ దేవతలు మరిడి మహాలక్ష్మి, కనకమహాలక్ష్మి అమ్మవార్ల జాతర్లు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆదివారం అమ్మవార్లను గ్రామంలోకి ఆహ్వానించే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాల నడుమ అమ్మవార్ల ఘటాలను ఊరేగించారు.

నిబంధనల ఉల్లంఘనపై కేసులు

రావులపాలెం: నూతన సంవత్సర వేడుకల్లో నిబంధనలు ఉల్లంఘించిన పలువురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై ఎం.వెంకటరమణ ఆదివారం తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ మూడు, ట్రిపుల్ రైడింగ్ ఆరు కేసులు నమోదు చేసినట్టు తెలిపారు.

పదిమందిపై కేసులు

అయినవిల్లి: మండలంలో న్యూ ఇయర్ వేడుకల్లో భాగంగా నిబంధనలు ఉల్లంఘించిన పది మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. న్యూఇయర్ వేడుకల్లో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పది మందిని అదుపులోకి డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పంట కాలువలోకి దూసుకువెళ్లిన జీపు



కాలువలో మునిగిపోయిన జీపు

రావులపాలెం: స్థానిక అమలాపురం రోడ్డులో ఆదివారం ఒక జీపు అదుపుతప్పి పంట కాలువలోకి దూసుకుపోయింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజమహేంద్రవరానికి చెందిన వెలుగుబంటి చరణ్ జీపులో కొత్తపేట వైపు వెళుతున్నాడు. పెంకులపాటి గరువు సమీపంలో ఎదురుగా వచ్చిన బైక్‌ను తప్పించబోయి అదుపుతప్పి పక్కనే ఉన్న ముక్తేశ్వరం బ్యాంక్ కెనాల్‌లోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో చరణ్ సురక్షితంగా బయటపడ్డాడు. అయితే నీటిలో మునిగిపోయిన జీపును రావులపాలెం పోలీసులు క్రేన్ సాయంతో బయటకు తీయించారు. సంఘటన ప్రాంతాన్ని ఎస్సై ఎం.వెంకటరమణ పరిశీలించారు.



అల్లవరంలో కేక్ కట్ చేస్తున్న జెడ్పీటీసీ గౌతమికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శులు



ఎంపీపీ శేషగిరిరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న తహసీల్దార్ సాంబశివప్రసాద్, రెవెన్యూ ఉద్యోగులు



తాళ్లరేవు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో న్యూ ఇయర్ కేకు కట్ చేస్తున్న ఎంపీపీ రాయుడు సునీత, ఎంపీడీఓ అనుపమ

సుఖ శాంతులతో వర్ధిల్లాలి

- నూతన సంవత్సర వేడుకల్లో పొన్నాడ
- వాడవాడలా సందడి చేసిన ప్రజలు

ముమ్మిడివరం: నూతన సంవత్సరంలో ప్రజలు సుఖ శాంతులతో వర్ధిల్లాలని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ఆకాంక్షించారు. ముమ్మిడివరం శివారు మహిపాల చెరువు గ్రాండ్ పార్క్‌లో ఆదివారం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ నలు మూలల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వచ్చి పొన్నాడకు నోట్‌బుక్స్, పెన్నులు, పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా పొన్నాడ మాట్లాడుతూ 2023లో అన్ని వర్గాల ప్రజలు ఆయురారోగ్యాలు అష్ట ఐశ్వర్యాలతో తులతూగాలని ఆకాంక్షించారు. డీసీ ఎంఎస్ చైర్మన్ దున్నా జనార్ధనరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు పెన్మత్స చిట్టిరాజు, ఢిల్లీ నారాయణ, కుడిపూడి శివన్నారాయణ, హితకారిణి సమాజం చైర్ పర్సన్ కాశి బాలమునికుమారి, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, కోలా బాబ్జీ, వేగిరౌతు రాజబాబు, ఎంపీపీలు కోలా గంగాభవానీ, పాలెపు లక్ష్మి, మిరియాం మేరి జ్యోతి, రాయుడు సునీత, జెడ్పీటీసీలు కుడిపూడి శివశంకరావు, నేల కిశోర్, దొమ్మేటి శామ్యూల్ సాగర్, ముదునూరి సతీష్‌రాజు, మండల పార్టీ అధ్యక్షులు జగతా పద్మనాభం, కాదా గోవిందకుమార్, పిన్నమరాజు శ్రీనురాజు, నల్లా నరసింహమూర్తి, టౌన్ కన్వీనర్ బొంతు సత్యశ్రీనివాస్, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు.



ముమ్మిడివరంలో కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకొంటున్న పొన్నాడ, పార్టీ శ్రేణులు



చొల్లంగి చర్చిలో చీరలు పంపిణీ చేస్తున్న శ్రీదేవి

వాడవాడలా..

నూతన సంవత్సర వేడుకలను వాడవాడలా ఘనంగా జరుపుకొన్నారు. ప్రతి లోగిలీ రంగవల్లులతో కొత్త సంవత్సరాన్ని స్వాగతించాయి. బంధు మిత్రులకు గ్రీటింగులు, ఎస్సెమ్మెస్‌లు, పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. నియోజకవర్గంలోని వివిధ పార్టీల నాయకులు అభిమానులు, అధికారులు సందడిగా గడిపారు.

తాళ్లరేవులో..

తాళ్లరేవు: నూతన సంవత్సర వేడుకలను ఆదివారం తాళ్లరేవు మండలంలో ఘనంగా జరుపుకున్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రాయుడు సునీత, ఎంపీడీఓ ఎం.అనుపమ న్యూ ఇయర్ కేకును కట్ చేసి అందిరికీ పంచారు. వారికి నాయకులు, కార్యకర్తలు పండ్లు, పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. జెడ్పీటీసీ దొమ్మేటి సామ్యూల్‌సాగర్ నివాసంలో, అలాగే పి.మల్లవరంలో పార్టీ రాష్ట్ర నేతలు దున్నా జనార్ధనరావు, కుడుపూడి శివన్నారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు టిళ్లపూడి నాగేశ్వరరావు తదితరులకు పార్టీ నాయకులు, కార్యకర్తలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసారు. తహసీల్దార్ ఎస్.పోతురాజు, ఎంపీడీఓ అనుపమకు పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు శుభాకాంక్షలు తెలియజేసారు. యూటీఎఫ్ ప్రతినిధులు ప్రజా ప్రతినిధులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాలలో వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు

నిరుపేదలకు చీరల పంపిణీ

మండల పరిధిలోని పలు ప్రార్థనా మందిరాలలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని చొల్లంగిలో పలు చర్చిలలో వైఎస్సార్ సీపీ నాయకురాలు, నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కాపవరపు శ్రీదేవి 200 మందికి చీరలు పంపిణీ చేశారు. అలాగే తాళ్లరేవు పెంకే వారిపేటలో న్యూ బెతస్థ ప్రార్థన మందిరంలో సుమారు 50 మంది వృద్ధులకు పాస్టర్ డి.అభిషేక్ రూబెన్ చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. అలాగే కోరంగి శ్రీ దుర్గామల్లేశ్వర వృద్ధుల, అనాథల ఆశ్రమంలో యానాం డిప్యూటీ కలెక్టర్ మునిస్వామి, ఎస్వీఎస్ కలెక్షన్స్ అధినేత తోట భవానీ ఆధ్వర్యంలో వృద్ధులు, చిన్నారులకు భోజనాలు పెట్టారు.

అల్లవరంలో..

అల్లవరం: తూర్పులంకలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు నివాసం వద్ద అభిమానులు న్యూ ఇయర్ కేక్ కోసి శుభాకాంక్షలు తెలిపారు. అల్లవరంలో జెడ్పీటీసీ గౌతమి నివాసం వద్ద సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉపాధ్యాయ సంఘాలు, పార్టీ శ్రేణులు ఆమెను మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. డి.రావులపాలెంలో ఏపీ అగ్రిమిషన్ సభ్యులు జిన్నూరి రామారావుకు, బెండమూర్లంకలో ఆల్డా చైర్మన్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి యాళ్ళ దొరబాబుకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

యానాంలో..



పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడిని సత్కరిస్తున్న దళిత నాయకులు

యానాం: న్యూ ఇయర్ సందర్భంగా వివిధ ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు ఉద్యోగులతో, ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక ఆర్ఏఓ మునిస్వామిని పీడబ్ల్యూడీ, రెవెన్యూ, విద్య, పోలీసు తదితర శాఖల సిబ్బంది సత్కరించారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు ఆయన స్వగృహం వద్దకు ప్రజలు, వివిధ శాఖల అధికారులు వచ్చి ఆయనను సత్కరించారు. ఎస్పీ రఘునాయగం, సీఐ శివగణేష్, ఎస్సై బడుగు కనకారావులను పోలీసుశాఖ సిబ్బంది సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. శనివారం అర్ధరాత్రి నుంచి స్థానిక సీగల్స్ రెస్టారెంట్ వద్ద పుదుచ్చేరి పర్యాటక శాఖ ఆధ్వర్యంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. యానాం, పరిసర ప్రాంతాలవారు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

సర్వత్రా శుభాకాంక్షల వెల్లువ

అమలాపురం టౌన్: నియోజకవర్గంలో నూతన సంవత్సర వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నేతల ఇళ్లు శుభాకాంక్షలు చెప్పేందుకు వచ్చిన అతిథులతో కిటకిటలాడాయి. జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ సీహెచ్ సుధీర్ కుమార్‌రెడ్డికి ఆ శాఖ సీఐలు, ఎస్సైలు, సిబ్బంది బోకేలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. డీఎస్పీ వై.మాధవరెడ్డి, పట్టణ, రూరల్ సర్కిళ్ల సీఐలు కొండలరావు, వీరబాబులకు కూడా పోలీసు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి నూతన సంవత్సర వేడుకలతోపాటు ఆమె తన పుట్టిన రోజు వేడుకలను కూడా జరుపుకొన్నారు. మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడితో పాటు కౌన్సిలర్లు, మున్సిపల్ కార్యాలయ అధికారులు, సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర దృశ్య కళల అకాడమి చైర్‌పర్సన్ కుడుపూడి సత్య శైలజ, ఏపీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు కన్వీనర కుడుపూడి సూర్యనారాయణరావు ఇళ్ల వద్ద కూడా నూతన సంవత్సర వేడుకలు జరగగా వారికి పలువురు నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.



ఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో నూతన సంవత్సర వేడుకల్లో ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి, ఏఎస్పీ లతామాధురి, డీఎస్పీలు, సీఐలు

లయన్స్ జిల్లా గవర్నర్ సేవలు

తాళ్లరేవు: లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ మాటూరి మంగతాయారు, రంగారావు దంపతులు ఆదివారం తాళ్లరేవు మండలంలో పర్యటించారు. కోరంగి శ్రీదుర్గామల్లేశ్వర వృద్ధుల, అనాథాశ్రమంలో పండ్లు పంపిణీ చేసారు. స్థానిక లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఐదుగురు నిరుపేదలకు ప్రతీరోజూ భోజనం అందించే పథకాన్ని మంగతాయారు ప్రారంభించారు. దీనికి సంబంధించి లయన్ కీర్తిశేషులు కొప్పిశెట్టి లక్ష్మయ్య జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు రూ.3 లక్షల నిధిని గవర్నర్‌కు అందజేశారు. అనంతరం మరో సభ్యుడు గుడాల శ్రీనివాసరావు దంపతులచే నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేశారు. స్థానిక హైస్కూల్‌లో వల్లీబాబు ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సుమారు రూ.లక్ష రూపాయలతో నిర్మించిన సైకిల్ షెడ్‌ను ప్రారంభించారు. తాళ్లరేవు సీహెచ్‌సీలో చెల్లూరి ప్రభాకరరెడ్డి ఆర్థిక సహాయంతో బీపీ ఆపరేటర్లు, వాటికి సంబంధించిన మెటీరియల్‌ను అందజేశారు. అనంతరం లయన్స్‌క్లబ్ హాలులో ధూళిపూడి బాబి ఆర్థిక సాయంతో విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్‌లను అందించారు. నిరుపేద మహిళకు కుట్టుమెషీన్, విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు బి.శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి సామా భగవాన్ తదితరులు పాల్గొన్నారు.



మంగతాయారుకు రూ.3 లక్షల చెక్కు అందజేస్తున్న కొప్పిశెట్టి లక్ష్మయ్య కుటుంబ సభ్యులు

చెన్నకేశవరెడ్డి వ్యాఖ్యలు తగవు

అమలాపురం రూరల్: కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో జరిగిన భూ హక్కు పత్రాల పంపిణీలో ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి వీఆర్ఓ, వీఆర్ఏలను అవమానకరంగా మాట్లాడడాన్ని జిల్లా వీఆర్ఏల సంఘం ఖండించింది. జిల్లా అధ్యక్షుడు సాధనాల ఎల్లేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం జరిగింది. జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేష్ అల్లాడి, గౌరవ అధ్యక్షుడు మద్దాల బాపూజీ, సహ అధ్యక్షులు కొప్పిశెట్టి గణేష్ పాల్గొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు తీసుకువెళ్లేది తామే అని గ్రహించాలని, అవినీతికి తామే కారణమని అనడంపై ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థలో నూటికి 90 శాతం సర్వీసులు చేస్తున్నారని, ఎమ్మెల్యే తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండు చేశారు.

ఆనందం అనిపింఛెన్

- సూర్యోదయానికే అందిన లబ్ధి
- పింఛను పెంపుపై అవ్వాతాతల హర్షం

అమలాపురం టౌన్: పెరిగిన పింఛన్లతో పట్టణంలో లబ్ధి పొందుతున్న అవ్వా తాతలు, వితంతువులు మురిసిపోతూ సీఎం జగన్‌కు కృతజ్ఞతలు చెప్తున్నారు. ఇప్పటి వరకు రూ.2,500 ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఈ కొత్త ఏడాది జనవరి నుంచి మరో రూ.250 పెంచి రూ.2750 ఇవ్వడంపై పట్టణంలో పింఛన్లు తీసుకుంటున్న 4,749 మంది లబ్ధిదారుల్లో హర్షం వ్యక్తమవుతోంది. పట్టణంలోని 15 వార్డు సచివాలయాల పరిధిలోని 290 మంది వలంటీర్లు సూర్యోదయానికి ముందే లబ్ధిదారుల చేతుల్లో ఆయా మొత్తాలను పెట్టారు. తొలి రోజు మొత్తం 4,749 పింఛన్లకు 3,585 అంటే 75.38 శాతం అందజేశారు. కొత్తగా మంజూరైన 127 కొత్త పింఛన్లు ఈనెల 4న ఇవ్వనున్నారు. ఆయా వార్డు కౌన్సిలర్లు కూడా వేకువ జామునే వలంటీర్లతో కలసి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు. కౌన్సిలర్లు సంసాని బులినాని, బండారు గోవిందు, గొవ్వాల రాజేష్, చిట్టూరి పెదబాబు తదితరులు పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు.

ఉప్పలగుప్తంలో 69.61 శాతం పంపిణీ

ఉప్పలగుప్తం: మండలంలో 69 .61 శాతం వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ చేసినట్లు ఎంపీడీవో కేఎస్ గౌరీకుమారి తెలిపారు. మండలంలో 17 గ్రామాల పరిధిలో 8030 పెన్షన్లు మంజూరయ్యాయని, వాటిలో 5590 మందికి పంపిణీ చేసినట్టు ఆమె తెలిపారు.



అమలాపురంలో అవ్వకు పింఛన్ సొమ్ము ఇస్తున్న వార్డు కౌన్సిలర్ గోవిందు, వలంటీర్



భీమనపల్లిలో మంచంపై ఉన్న వృద్ధులకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్

వైష్ణవాలయాలు ముస్తాబు

ముమ్మిడివరం: ముక్కోటి ఏకాదశి సందర్భంగా నియోజకవర్గంలో వైష్ణవ దేవాలయాలు ఉత్తర ద్వార దర్శనాలకు ముస్తాబయ్యాయి. తెల్ల వారు జామునే తలార స్నానాలు చేసి భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేస్తారు. ముమ్మిడివరంలో శ్రీ, భూ సమేత కేశవస్వామి, పల్లిపాలెం శ్రీహరి సాకేత వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నిర్వాహకుల ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని ఏకాహాలు నిర్వహిస్తున్నారు.

పల్లిపాలెం శ్రీహరి సాకేత వేంకటేశ్వరస్వామి ఆలయం



యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు

- చీకటి మాటున మట్టి, ఇసుక తరలింపు
- అనుమతులు లేకుండానే అక్రమ రవాణా
- వాహనాల ధాటికి కుదేలవుతున్న రహదారులు



ఎస్.యానాంలో తవ్వకాలు జరుగుతున్న ప్రదేశం



ఎన్.కొత్తపల్లిలో అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు

ఉప్పలగుప్తం: మండలంలో ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. మండల పరిధి గ్రామాలైన ఎస్.యానం, వాసాలతిప్ప, ఎన్.కొత్తపల్లి, వానపల్లిపాలెం, చల్లపల్లి గ్రామాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా తవ్వకాలు జరుగుతున్నాయి. ఈ అక్రమాల ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి గండి పడుతోంది. అలాగే ఈ బరువైన వాహనాల రాకపోకలతో రహదారులు అధ్వానంగా మారుతున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సముద్రతీర ప్రాంతాల్లో ఉండే బొండు ఇసుకకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. తీర ప్రాంతాల్లో ఇసుకను, ఖాళీగా ఉన్న స్థలాలను సేకరించి దూర ప్రాంతాలకు తీసుకువెళ్లి అధిక లాభాలకు విక్రయిస్తున్నారు. ఎస్.యానంలో, ఎన్.కొత్తపల్లి గ్రామాల నుండి రాత్రి 11 గంటల సమయం నుంచి తెల్లవారు జాము 5 గంటల వరకు వందల సంఖ్యలో లారీలు, ట్రాక్టర్లతో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని గ్రామస్తులు అంటున్నారు.

అనుమతులు లేకుంటే చర్యలు



మండలంలో ఎక్కడా ఎటువంటి మట్టి పనులకు అనుమతులు ఇవ్వలేదు. అక్రమంగా తరలించే వారు ఎవ్వరైనా మా దృష్టికి వస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే కొన్ని చోట్ల అనధికారకంగా పనులు చేపడుతున్న వారిని హెచ్చరించి పనులు నిలిపివేశాం. అవసరాల మేరకు మట్టి తవ్వకాలు జరపాల్సి వస్తే మైనింగ్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల జాయింట్ కమిటీల ఆదేశాలతో అనుమతులు తీసుకోవాలి. ప్రభుత్వ భూములలో తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటాం.

– జవ్వాది వెంకటేశ్వరి, తహసీల్దార్, ఉప్పలగుప్తం

ముక్కోటి ఏకాదశికి ఆలయాల ముస్తాబు

ఆత్రేయపురం: హిందూ పురాణ ప్రసిద్ధ సంప్రదాయ పర్వదినాల్లో ప్రధానమైన 'వైకుంఠ ముక్కోటి ఏకాదశి' సోమవారం ఘనంగా నిర్వహించేందుకు మండలంలోని ప్రసిద్ధ ఆలయాలను ముస్తాబు చేశారు. ధనుర్మాసంలో పౌర్ణమి ముందు వచ్చే ఏకాదశిని వైకుంఠ ముక్కోటి ఏకాదశిగా జరుపుకొంటారు. దీంతో సోమవారం ఉదయం నుంచే స్వామి వారి దర్శనానికి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశారు. కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి వేంకటేశ్వర స్వామి, ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి, ఆత్రేయపురం వేణుగోపాలస్వామి, లక్ష్మీ వేంకటేశ్వరస్వామి, కనకమహాలక్ష్మి, మల్లమ్మ ఆలయాలతో పాటు బొబ్బర్లంకలో వేంచేసిన అభయహస్త ఆంజనేయ స్వామి ఆలయాలను ముస్తాబు చేశారు. ప్రసిద్ధ దేవాలయాల్లో ఉత్తర ద్వార దర్శనాలకు, ప్రత్యేక పూజల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

రావులపాలెం: మండలంలోని ఊబలంక లంక పొలాల్లో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురు జూదరులను అరెస్టు చేసినట్టు ఎస్సై సురేంద్ర తెలిపారు. ఆదివారం సాయంత్రం పోలీసులకు అందిన సమాచారంతో దాడి చేసి వారి వద్ద నుంచి రూ.3 వేల నగదు, పేక ముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

నేడు ఆఖరు మజిలీ శాశ్వత కట్టడం ప్రారంభం

అంబాజీపేట: మాచవరం హిందూ శ్మశానవాటికలో శ్రీరామ్‌ఘాట్–దుర్గా క్షేత్రం వద్ద నూతనంగా నిర్మించిన ఆఖరు మజిలీకి శాశ్వత కట్టడాన్ని సోమవారం ప్రారభించనున్నారు. ఈ కట్టడాన్ని మంచాల పెదకాపు, సుబ్బలక్ష్మి జ్ఞాపకార్థంగా వారి కుమారులు నిర్మించి ఇతరులకు ఆదర్శంగా నిలిచారు.



మాచవరంలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న శ్మశాన వాటిక